# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 126 గుంటూరు, శుక్రవారం 16- 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు



**అమరావతి, జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకున్న సీఎం.. ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తామని ప్రకటించారు. గురువారం (జనవరి 15) నారావారిపల్లెలోని సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఈ మేరకు మీడియాకు వెల్లడించారు. పండుగ సందర్భంగా పెద్దలను స్మరించుకోవడం, ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతిలో భాగమని సీఎం చంద్రబాబు చెప్పారు. 2047లోగా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉంటేనే.. సంపదకు విలువ ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంపద పెంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు చెప్పారు. అందుకే తాము పీ4కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. దాదాపు 10 లక్షల మందిని ఈ విధానం కిందకు తీసుకొచ్చామన్నారు. కాగా, తిసుకునే ఆహారం, తాగునీరు, ఆలోచనల్లోనే.. ఆరోగ్యం ఉంటుందని తెలిపారు చంద్రబాబు. అందుకే ఈ ఏడాది రాష్ట్రమంతటా సంజీవని ప్రాజెక్టును అమలు చేసి.. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య రికార్డులు తయారు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంతో పాటు.. సోలార్ విద్యుత్‌ను మరింత ప్రోత్సహిస్తామని, అన్ని పంపుసెట్లకు 'కుసుం' పథకం కింద సోలార్ పరికరాలు అందిస్తామని తెలిపారు.

ఏంటీ సంజీవని ప్రాజెక్టు .. ?

రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య బీమాను అందించడానికి ప్రభుత్వం సంజీవని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తారు. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఆరోగ్య బీమా కల్పించేలా.. ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీ రూపొందించారు. సంజీవని పథకం కింద ప్రతి కుటుంబానికి ఏటా రూ. 25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద ఉన్న ఆసుపత్రుల్లో ఫ్రీగా వైద్య సేవలు పొందొచ్చు. కాగా, దాదాపు 3,250 చికిత్సలు ఈ విధానంగా ద్వారా ఉచితంగా లభిస్తాయి.

సంజీవని పథకం కింద ప్రజలకు రూ. 2.50 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు అందుతాయి. అందుకోసం ప్రజల తరుఫున ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తుంది. కాగా వైద్య చికిత్స ఖర్చు రూ. 2.5 లక్షలు దాటితే.. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద రూ. 25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తారు. చాలా వరకు చికిత్సలకు అయ్యే ఖర్చు రెండున్నర లక్షల లోపే ఉండటంతో.. ప్రభుత్వం పథకాన్ని ఇలా రూపొందించినట్లు తెలుస్తోంది.

ఈ సంజీవని ప్రాజెక్టును మొదటగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అనంతరం అనంతరం ఇటీవల చిత్తూరు జిల్లాలో అమలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తాజాగా రాష్ట్రమంతటా ఈ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## కేంద్రం కీలక నిర్ణయం



**జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇరాన్‌లో కొనసాగుతున్న భారీ నిరసనలు, అల్లర్ల నేపథ్యంలో అక్కడ ఉన్న భారతీయులను స్వదేశానికి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో మొదటి విడత భారతీయు లను రేపే విమానాల్లో తరలించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించా యి. ఇరాన్ లో ఉన్న భారతీయులు, ముఖ్యంగా విద్యార్థు లు, ఉద్యోగులు, భద్రతా పరంగా ప్రమాదంలో ఉన్నారని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ ఇప్పటికే అలర్ట్ జారీ చేసింది. భారతీయులు నిరసన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, అవసరమైతే అందుబా టులో ఉన్న విమానాల ద్వారా ఇరాన్ విడిచి రావాలని సూచిం చింది.

ఇండియన్ ఎంబసీ, టెహ్రాన్ ద్వారా పరిస్థితిని ఎప్ప టికప్పుడు సమీక్షిస్తున్నామని, అవసరమైతే ప్రత్యేక విమానాల ద్వారా తరలింపు చేపడతామని కేంద్రం తెలిపింది. పరిస్థితిని బట్టి తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఇరాన్‌లో పరిస్థితి ఇంకా పూర్తిగా అదుపులోకి రాకపోవ డంతో భారతీయుల భద్రతే అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.


## జగన్, కేసీఆర్‌పై ఎమ్మెల్యే సోమిరెడ్డి సంచలన ఆరోపణలు

**నెల్లూరు,జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రులు జగన్, కేసీఆర్‌పై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌తో లాలూచీ పడి జగన్ రాయలసీమ లిఫ్ట్‌ను తాకట్టు పెట్టారని ఆరోపించారు. అప్పట్లో తెలంగాణలో అన్న కేసీఆర్ సీఎం అయితే.. ఏపీలో తమ్ముడు జగన్ సీఎం.. ఇద్దరిదీ విడదీయలేని అనుబంధం అంటూ ఎద్దేవా చేశారు. 2020లో తెలంగాణ ఫిర్యాదుతో రాయలసీమ ఎత్తిపోతలపై ఎన్జీటీ స్టే విధించిందని తెలిపారు. 2024 వరకు దాదాపు నాలుగేళ్ల పాటు, ఇద్దరూ సీఎంలుగా ఉన్న సమయంలో స్టే కొనసాగిందని చెప్పారు. వీరి కుమ్మక్కు రాజకీయాలని ఏపీ ప్రజలు అర్థం చేసుకున్నారని ఎమ్మెల్యే అన్నారు.



ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఏపీ సీఎం చంద్రబాబు కుమ్మక్కు అయ్యారని ఆరోపించడం విడ్డూరంగా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎన్జీటీ స్టే విధించిందా? ఎన్జీటీ పనులు ఆపిందా? ఎన్జీటీ ఫెనాల్టి వేసిందా? అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. అసలు లిఫ్ట్ పనులే మొదలు పెట్టలేదని.. రూ.వందల కోట్లు దోచుకోవడం కోసమే మట్టి పనులకి పరిమితమయ్యారని విమర్శించారు. మట్టి పనుల బిల్లులు చేసుకోవడానికి మాత్రం, ఎన్జీటీ స్టే అడ్డురాలేదని.. లిఫ్ట్ నిర్మాణానికే స్టే అడ్డువచ్చినట్టుంది అంటూ చురకలంటించారు. ఇంత బహిరంగంగా రాయలసీమను కేసీఆర్‌కు తాకట్టు పెట్టిన జగన్ సినిమా కథలను ప్రజలు నమ్మరన్నారు. ప్రజలంతా అర్థం చేసుకున్నారని.. వైసీపీ నేతలు నోళ్లు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హెచ్చరించారు.

## ప్రకృతి సమతుల్యతే పొంగల్!



### ఇది.. ప్రపంచస్థాయి పండుగ, పురాతన నాగరికతకు చిహ్నం

### ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పీఎం

**న్యూఢిల్లీ, జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రకృతిని సమతుల్యం చేయడమే పొంగల్ ఇస్తున్న సందేశమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. దీనిని ప్రపంచస్థాయి పండుగగా అభివర్ణించారు. పురాతన నాగరికతకు చిహ్నమని తెలిపారు. విశ్వవ్యాప్తంగా ఉన్న తమిళులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే ఉత్సవమని పేర్కొన్నారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ నివాసంలో బుధవారం పొంగల్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని దాదాపు తమిళ సంప్రదాయాన్ని పాటించారు. ఈ వేడుకలకు తమిళనాడుకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఇటీవల విడుదలైన తమిళ మూవీ 'పరాశక్తి' బృందం కూడా హాజరైంది. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వచ్చే కొద్ది మాసాల్లో తమిళనాడు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈ పండుగ రైతు కష్టాన్ని, భూమికి-భానుడికి కృతజ్ఞతను తెలియజేస్తుందని అన్నారు.

కృతజ్ఞత కేవలం మాటలకే పరిమితం కాకుండా దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాలని ఈ పండుగ చెబుతుందన్నారు. పుడమి మనకు ఎన్నో ఇస్తోందని.. దానిని పరిరక్షించుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తు తరాల కోసం వనరులను తెలివిగా వినియోగించు కోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజం పొంగల్‌ను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటుందని.. వారితో కలిసి తాను ఈ వేడుక నిర్వహించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. జీవించి ఉన్న పురాతన నాగరికతకు తమిళ సంస్కృతి నిదర్శనమని కొనియాడారు. కాగా.. 'వణక్కం' అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పొంగల్‌ను నేడు ప్రపంచ వేడుకగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కాగా.. ఈ వేడుకల్లో 'పరాశక్తి' సినిమా బృందం సందడి చేసింది.

ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే పండుగలు

ఈ సందర్భగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, 'సంక్రాంతి, పొంగల్ రైతులకు, ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే పండుగలు. దేశ వ్యవసాయ సంప్రదాయాలను, సాంస్కృతిక ఏకత్వాన్ని, ఘనమైన వారసత్వాన్ని గౌరవించే సందర్భాలు' అని పేర్కొన్నారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, సంక్రాంతి, పొంగల్ దేశ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక అని పేర్కొన్నారు.



## మమతా బెనర్జీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ..

**న్యూఢిల్లీ, జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సర్కారుకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఐ-ప్యాక్ కార్యాలయంపై ఈడీ జరిపిన సోదాల

2లో

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ..

**రాయ్‌పూర్, జనవరి 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. 52 మంది మావో యిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. గురువారం ఉదయం బీజాపూర్ జిల్లా ఉన్నతా ధికారులతోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఎదుట వీరంతా లొంగిపోయారు. వీరిలో 21 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు.

లొంగిపోయిన వారిలో దండకారణ్యం స్పెషల్ జోన్, ఏవోబీలో విధులు నిర్వహిస్తున్న మావోయిస్టులతోపాటు బహ్మరాఘడ్ ఏరియా కమిటీలోని సభ్యులు సైతం ఉన్నారు. వీరిపై రూ. 1.41 కోట్ల రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు ఈ సందర్భంగా తెలిపారు. లొంగిపోయిన మావో యిస్టులకు పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన భరోసా కల్పించడంతో వీరంతా లొంగిపో

2లో



## మమతా బెనర్జీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ..

నేపథ్యంలో తలెత్తిన వివాదంపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ఈడీ అధికారు లపై నమోదైన ఎఫ్ఐఆర్ లపై స్టే విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది.

వివాదం నేపథ్యం :

జనవరి 8న కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాల యం, దాని డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో బొగ్గు కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడికి చేరుకుని తమ దర్యాప్తునకు ఆటంకం కలిగించారని, కీలక ఆధారాలను, డిజిటల్ పరికరాలను తీసుకువెళ్లారని ఈడీ ఆరోపించింది. దీనిపై బెంగాల్ పోలీసులు ఈడీ అధికారులపైనే కేసులు నమోదు చేయడంతో, ఆ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ..

యా రని బీజాపూర్ జిల్లా ఎస్పీ జీతేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు.లొంగిపోయిన వారిలో.. డివిజన్ కమిటీ సభ్యుడు లక్కు కరం అలియాస్ అనిత్ (32), ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు లక్ష్మీ మాడ్వి



**క్రోసూరు క్రైమ్ కౌంటర్ పోతుగంటి నాగేశ్వరరావు** 19 25 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర లో ఆవిరవించినట్లుగా ప్రకటించిన భారత కమ్యూనిస్టు పార్టీకి 2025 డిసెంబర్ 26 కు వందేళ్లు నిండుతున్నాయి ఈ సందర్భంగా 2026 జనవరి 18న ఖమ్మంలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందల ప్రస్తావన శతవత్సల వేడుకలను జయప్రదం చేయండి ఈ యొక్క కార్యక్రమం సిపిఐ క్రోసూరు మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు క్రోసూరు శాఖ కార్యదర్శి పసుపులేటి యాదగిరి ఎస్ఎఫ్ఐ ఏవైపు నాయకులు నాగరాజు యువజన సమైక్య నాయకులు చంద్రగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా నిర్వహించిన సుంకులమ్మ పెద్దమ్మతల్లి రథోత్సవం.!!



**పెద్దవడుగూరు క్రైమ్ కౌంటర్ న్యూస్ జనవరి 15 రిపోర్టర్ సి రాము :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం లోని సుంకులమ్మ పెద్దమ్మ తల్లి, ఆలయంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం విగ్రహాన్ని రథోత్సవంలో ఉంచి ఊరేగింపు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తాదులకు అందజేశారు. అనంతరం, ఓబులాపురం గ్రామం శ్రీ పెద్దమ్మతల్లి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పూజారి రామాంజనేయులు మాట్లాడుతూ రాత్రికి భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'వెస్ట్ బైపాస్'పై చలో చలో




గుంటూరు, జనవరి 15 విజయవాడ వెస్ట్ బైపాస్ సంక్రాంతి నుంచి అందుబాటులోకి రానుంది. అన్ని రకాల వాహనాలను ఒకవైపు అనుమతించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జిల్లా కాజ, చినకాకాని జంక్షన్ నుంచి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి మీదుగా చిన్న అవుటుపల్లి టోల్‌గేట్ జంక్షన్ వరకూ వెళ్లేందుకు వీలుగా ఒకవైపు రహదారిని ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధం చేసింది. బుధవారం రహదారి పనులను క్షుణ్ణంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పరిశీలించారు. గుంటూరు నుంచి అమరావతి, గొల్లపూడి, విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, ఉత్తరాంధ్ర వైపు వెళ్లే వారికి వీలుగా 15 నుంచి రాకపోకలను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఆమేరకు కాజ టోల్ గేటు వద్ద ఎన్‌హెచ్- 16, వెస్ట్ బైపాస్ అనుసంధాన పనులు ఒకవైపు పూర్తయినట్లు జాతీయ రహదారుల సంస్థ స్పష్టం చేసింది.

# ఇదెక్కడి న్యాయం. వాపోయిన వెంకటరెడ్డి

**బిక్కవోలు క్రైం కౌంటర్. జనవరి 15.** బలభద్రపురం పంచాయతీ కార్యదర్శులపై బిక్కవోలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుని ఫిర్యాదు పై చర్య తీసుకొమ్మని ఎస్సైని ఆదేశించిన జిల్లా కలెక్టర్. మరణించిన భార్య మరణ ధ్రువీకరణ పత్రాన్ని భర్తకి ఇవ్వకుండా ఆమెకి వారసులు కాని ఇద్దరికి ఇచ్చిన బలభద్రపురం కార్యదర్శులు నిర్వాకం ఇది. వివరాల్లోకి వెళితే, తన భార్య కోనాల పార్వతి గత సంవత్సరం నవంబర్ 25న మరణించిన విషయాన్ని ఆమె భర్త, విశ్రాంత ఉపాధ్యాయుడు కోనాల వెంకటరెడ్డి గ్రామపంచాయతీకి తెలియపరిచారు. అయితే ఆమె మరణ ధ్రువీకరణ పత్రాన్ని వెంకటరెడ్డికి ఇవ్వకుండా, చట్టపరంగా కానీ న్యాయపరంగా కానీ వారసులు కాని ఆమె సోదరుడు వెలగల అచ్యుత రామారెడ్డికి అప్పటి కార్యదర్శి పి అచ్చియ్య చౌదరి ఇవ్వడం విశేషం. చౌదరి స్థానంలో తదుపరి కార్యదర్శిగా వచ్చిన గొంగల అశోక్ కుమార్ కూడా భర్త అయిన వెంకటరెడ్డికి ఇవ్వకుండా మరణించిన పార్వతికి మొదటి భర్త కర్రి వెంకటరెడ్డి (లేటు) యొక్క మొదటి భార్య కుమారుడు, తాపేశ్వరం గ్రామపంచాయతీ కార్యదర్శి అయిన కర్రి వెంకట చక్రధరరెడ్డికి ఇవ్వడం చేసారని విశ్రాంత ఉపాధ్యాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. భర్తగా తాను తన భార్య మరణ ధ్రువీకరణ పత్రంను ఆర్.టి.ఐ తో సహా నాలుగు సార్లు దరఖాస్తు చేసినా కార్యదర్శి అశోక్ వాటిని బేఖాతరు చేశారని తెలిపారు. తన భార్య ఆస్తులను అక్రమంగా కాజేయాలనే దురుద్దేశ్యంతో ఉన్న చక్రధరరెడ్డి, అచ్యుత రామారెడ్డిలతో పంచాయితీ కార్యదర్శులు ఇద్దరూ కుమ్మక్కయ్యారని వెంకటరెడ్డి ఆరోపించారు. తన ఆర్టిఐ దరఖాస్తుకు బిక్కవోలు మండల అభివృద్ధి అధికారి స్పందిస్తూ తక్షణం పార్వతి మరణ ధ్రువీకరణ పత్రమును భర్త అయిన తనకు ఇమ్మని డిసెంబర్ 29న ఆదేశించినా, కార్యదర్శి అశోక్ సదరు ఆదేశాన్ని సైతం బేఖాతరు చేశారన్నారు. చివరకు స్పందనలో కలెక్టర్ కి తాను నివేదించగా కలెక్టర్ ఆదేశంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 9వ తేదీన తన భార్య మరణ ధ్రువీకరణ పత్రమును ఇచ్చారని ఆయన తెలిపారు. మండల అభివృద్ధి అధికారి ఆదేశాన్ని కూడా ఖాతరు చేయకపోవడానికి కారణం, వారసులు కాని వారికి తామిచ్చిన మరణ ధ్రువీకరణ పత్రంతో వారిలో ఎవరో ఒకరు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందే విధంగా వారికి తగినంత సమయం ఇచ్చే దురుదేశ్యంతోనే కార్యదర్శులు కాలయాపన చేస్తూ వచ్చారని



ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారసులు కాని వారితో నేరపూరిత కుట్రలో భాగస్వాములు అయి కర్తవ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్య వైఖరితో తప్పుడు సమాచారంతో రెవెన్యూ శాఖను మోసగించి, వారు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందేందుకు వారితో కుమ్మక్కైన పూర్వ, ప్రస్తుత కార్యదర్శులతో పాటు సదరు నలుగురు కుట్రదారులపై బిక్కవోలు పోలీస్ స్టేషన్ లో కోనాల వెంకటరెడ్డి క్రిమినల్ కంప్లైంట్ చేశారు. ఆయన ఫిర్యాదు పై తగు విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ బిక్కవోలు సబ్ ఇన్స్పెక్టర్ కి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకటన తో పాటు ఉన్నతధికారులు జారీ చేసిన ఆదేశాల వివరాలు కూడా వెంకటరెడ్డి మీడియా కు అందించారు.

## నరసింహారావు చిన్నాన్న పరామర్శించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం :** ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామంలో ఫిరంగిపురం మండల పార్టీ అధ్యక్షులు మండవ చిన్న నరసింహారావు చిన్నాన్న మరణించగా వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించిన తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్



పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం సత్తెనపల్లి మండలంలో ధూళిపాళ్ల గ్రామంలోని రామాలయంలో ధనుర్మాసాన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సీతారాముల వారికి , లక్ష్మణులవారికి, హనుమంతులవారికి, విగ్నేశ్వరునికి వెండి కిరీటాలను సమర్పించిన కార్యక్రమం లో పాల్గొన్న, సత్తెనపల్లి జనసేన పార్టీ సమన్వయ కర్త శ్రీ బొర్రా వెంకటఅప్పారావు గారు ముఖ్య అతిథిగా వేచేసి స్వామివారి పల్లకిని ఊరిగిస్తూ స్వామివారి ఆశీర్వచనం తీసుకున్న గుంటూరు నగర మాజీ మేయర్ శ్రీ కన్నా నాగరాజు గారు మరియు వివిధ హెూదాలో ఉన్న కూటమి నాయకులు అభిమానులు పాల్గొన్నారు

## ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం :** మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో వెనవోలు సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో పాల్గొని ముగ్గుల పోటీలు, క్రికెట్ పోటీలు తిలకించి విజేతలకు బహుమతులు అందజేసిన తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్

# బరిలోకి.. బాపట్ల

ఇంటర్నెట్ డెస్క్: బాపట్ల జిల్లావ్యాప్తంగా కోడి పందేల బరుల వద్ద భోగి రోజు దాదాపు రూ.70 కోట్లు చేతులు మారాయి. చెరుకుపల్లి మండల పరిధిలో దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బరిలోనే దాదాపు రూ.30 కోట్ల పందేలు జరిగినపట్లు సమాచారం. పిట్టలవానిపాలెం మండల పరిధిలో పూర్తి హంగులతో బరిని కొలువుదీర్చి భారీగా జూద క్రీడలు నిర్వహించారు. ఇక్కడ రూ.25 కోట్ల వరకూ పందేలు జరిగినట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో కూడా పెద్దసంఖ్యలో బరులు ఏర్పాటు చేశారు. చెరుకుపల్లి మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. పందేల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులకు ఆయనే స్వాగతం పలికారు.బుల్లెట్ గెలుచుకున్న బాపట్ల ఎమ్మెల్యే.. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో ప్రత్యేక బహుమతి బుల్లెట్‌ను స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గెలుచుకున్నారు. పది పందేలకు గాను వరుసగా ఆరుసార్లు ఆయనే విజయం సాధించారు. ఈ పందేల్లో నరేంద్రవర్మతో పాటు ఆయన కుమారుడు కూడా పాల్గొన్నారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య కుమారుడు కూడా ఈ బరి వద్దే కోడి పందేలను వీక్షించారు. ఇదే బరిలో ఇంకో బుల్లెట్‌ను కర్లపాలెం మండలానికి చెందిన ఓ వ్యక్తి గెలుచుకున్నారు. ఇక పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొనకంచివారి పాలెం సమీపంలో, నరసరావుపేట మండలం దొండపాడు వద్ద ఏర్పాటు చేసిన కోడి పందేల బరులు కిటకిటలాడుతున్నాయి. దొండపాడు బరికి ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు.

# వైసీపీ వర్గీయుల బరితెగింపు.. టీడీపీ కార్యకర్తలపై దాడి



**జనవరి 15 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** బత్తలపల్లి(అనంతపురం): వైసీపీ నాయకులు బరితెగించారు. టీడీపీ వర్గీయుల ఇంట్లోకి చొరబడి దాడి చేశారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామంలో బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌లతో స్టంట్లు చేస్తూ హల్‌చల్ చేశారు. వారి దాడిలో టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్, ఆయన తల్లి నాగలక్ష్మి, మరో మహిళ నాగజ్యోతి గాయపడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు, వైసీపీ నాయకులు అనుమతి లేకుండా పోట్లమర్రి చెరువు మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారి ట్రాక్టర్లను సీజ్ చేసి, తహసీల్దారుకు అప్పగించారు. తహసీల్దారు స్వర్ణలత రూ. 15 వేలు జరిమానా విధించారు. మరోసారి మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించి, ట్రాక్టర్‌లను అప్పగించారు. దీంతో గ్రామంలోకి వెళ్లిన వైసీపీ నాయకులు టీడీపీ వర్గీయుల ఇళ్ల వద్ద ట్రాక్టర్లను తిప్పుతూ హల్‌చల్ చేశారు. సీఎం చంద్రబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను దూషించారు. టీడీపీ కార్యకర్తల ఇళ్లలోకి రాళ్లు విసిరారు. సామగ్రిని ధ్వంసం చేశారు. టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్‌ను రోడ్డుపైకి ఈడ్చుకెళ్లి దాడి చేశారు. అడ్డొచ్చిన మహిళలపై దాడి చేశారు.

తమ ప్రభుత్వం వచ్చాక రప్పా రప్పా నరుకుతామని బెదిరించారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రభాకర్ గ్రామానికి వెళ్లి బాధితులను విచారించారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు నారాయణ రెడ్డి, సురేంద్ర, అప్పస్వామి. అశోక్, గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిటాల శ్రీరాం బాధితులకు ఫోన్ చేసి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జ్ఞానానంద రెడ్డి, రాంమోహన్ రెడ్డిపై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చికెన్ హై.. రొయ్య డౌన్

తణుకు(అమరావతి): చికెన్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో చికెన్‌ధర కేజీ రూ. 320 వరకు అమ్ముతున్నారు. అయితే ఒక్కోచోట ఒక్కో రకంగా ధర ఉంటోంది. దీనికి కారణం అనుకున్నంతగా వ్యాపారాలు జరగడం లేదని, దానిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాలను బట్టి ధరలు ఉంటున్నాయంటున్నారు.

తగ్గిన అమ్మకాలు... సాధారణంగా చికెన్ అమ్మకాలు గతంతో పోల్చితే ప్రస్తుతం తణుకు పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రస్తు తం సంక్రాంతి పండుగ వల్ల కుటుంబ ఖర్చు లు, పిల్లలు బట్టలు, ఇంటి ఖర్చులు ఎక్కువ కావడం వల్ల అమ్మకాలు తగ్గినట్లు వ్యాపారు లు భావిస్తున్నారు. ఇపుడున్న ధరలు మాత్ర మే సంక్రాంతికి కూడా కొనసాగే అవకాశాలు ఉంటాయని వ్యాపారులు అంచనా వేస్తున్నా రు. చికెన్ ధర పెరిగినప్పటికి కొనుగోలు దారు లు సంఖ్య బాగా తగ్గిపోవడం వల్ల ఇంకా ధర లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ఇంటిగ్రేటెడ్ కంపెనీల సిండికేట్ వల్ల ధరల పెరుగుదల, తగ్గుదల నిర్ణయాలు జరుగుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులు నష్టాలు భరించలేక బ్రాయిలర్ రంగం నుంచి ఇతర రంగాలకు వెళ్ళిపోయారు. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 200 మంది నుంచి తగ్గు తూ ఇపుడు పదుల సంఖ్యలో ఉన్నారు. అం దువల్ల కంపెనీలు ఆధిపత్యం లోనే ధరలు ఉంటున్నాయి.బర్డ్‌ఫ్లూ నుంచి బయటపడి..

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో తీవ్రంగా పడిపోయిన కోడి మాంసం విక్రయాలు అనంతరం గణనీయంగా పెరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వినియో గదారులుకు చికెన్ పై నమ్మకం కుదరడంతో పాటు పండగలు, శుభకార్యాలు, హెూటల్ రంగంలో డిమాండ్ పెరగడం వంటి అంశాలు అమ్మకాలు పెరుగుదలకు కారణం అయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో విని యోగదారులు చికెన్ కొనుగోలుకు వెను కాడటంతో అమ్మకాలు ఒక్కసారిగా పడిపో యిన సందర్భాలు ఉన్నాయి.

సాధారణంగా రోజుకు 10 నుంచి 11 లక్షల కిలోల వరకు ఉండే చికెన్ విక్రయాలు, ఆ సమయంలో 4 నుంచి 5 లక్షల కిలోలకు పడిపోయాయి. 2026లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమ్మకాలు జోరు ఊపందుకుంది. బర్డ్ ఫ్లూ భయాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ అవ గాహన కార్యక్రమాలు, పౌల్ట్రీ సంఘాలు ప్రచారం ఫలితంగా వినియోగదారులకు నమ్మ కం ఏర్పడి చికెన్ అమ్మకాలు పెరిగాయి. గత ఏడాది నష్టాలు నుంచి ఇపుడిపుడే బయట పడుతున్నారు. మరి సంక్రాంతికి అమ్మకాలు ఎలా ఉంటాయో?

మార్కెట్‌ను బట్టి అమ్మకాలు

ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు చాలా వరకు తగ్గాయి. రోజు వారి అమ్మకాల్లో సగం వరకు పడిపోయాయి. ధరలు పెరగడం వల్ల కొనుగోలు దారులు తగ్గుతున్నారు. దీంతో వ్యాపారులు ఒక్కోచోట ఒక్కో ధరకు అమ్ముతు న్నారు. పది రోజుల నుంచి ధర పెరుగుతూ వస్తుంది. సంక్రాంతికి కూడా ఇవే ధరలు ఉండే అవకాశం ఉంది.

ఆకివీడు: వ్యాధులు, సీడ్, ఫీడ్ నాణ్యత లోపంతో నష్టాలు బారిన పడిన ఆక్వా రంగం విస్తీర్ణంలో దాదాపు 70శాతం తగ్గిపోయింది. దీంతో వ్యాపారులు ధరలను పెంచుకుంటూ వెళ్ళారు. 100 కౌంటు రూ. 220 నుంచి రూ. 275 వరకు తీసుకెళ్ళారు. ఈ విధంగా పెంచడం ద్వారా రైతుల్లో ఆశలు రేకెత్తించారు. అయితే సంక్రాంతి పండుగ కు ఆక్వా రైతులను వ్యాపారులు కోలు కోలేని దెబ్బ తీశారు.

సంక్రాంతి సందర్భంగా పని చేసేవారికి సెలవులు ప్రకటిస్తామని, ఉత్పత్తులను కొనుగోలు చెయ్యలేమని అనధికారికంగా ప్రకటించారు. దీనికి తోడు వాతావరణంలో వచ్చిన మార్పులకు ఉత్పత్తులు పెరుగుతుండటంతో ధరలను అమాంతం రూ. 25 వరకు తగ్గించేశారు. రూ. 275 పలికిన 100 కౌంటు ధర ప్రస్తుతం రూ.250 పలుకుతున్నది. ప్రతి కౌంటుకు రూ.25 తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పెంచినట్టే పెంచి తగ్గించేసి రైతులను నష్టాలు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణ చంద్రగిరి మండలం: సీఎం చంద్రబాబు

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరుపతి, జనవరి 15: తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నారావారిపల్లెలో ప్రకటించారు. స్వర్ణనారావారిపల్లె తరహాలో స్వర్ణ చంద్రగిరికి ఆయన ప్రణాళికలు రూపొందించారు. స్వర్ణకుప్పం, నారావారిపల్లె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణ చంద్రగిరి మండలాన్ని తీర్చిదిద్దనున్నారని చెప్పారు. ఇందుకు వీలుగా ప్రణాళికల్ని అమలు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికల్ని అమలు చేయనున్నారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారిపల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమానికి ఎంపిక చేసిన విషయం విదితమే. స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి.

ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ నూటికి నూరు శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా వారి తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగింది.



మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ కార్యక్రమాలను కూడా సమర్ధవంతంగా అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రతి లబ్దిదారుడికి చేరేలా చేయటంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు స్వర్ణ నారావారిపల్లె కార్యక్రమంలో భాగంగా అమలు చేశారు. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. ఏడాది లోపు నిర్దేశించుకున్న ఫలితాలు సాధించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

# ప్రతి ఇంటా పండుగ సంబరాలు అంబరాన్నంటాలి: పవన్, లోకేశ్




ఇంటర్నెట్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్.. తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా పండుగ సంబరాలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రజలందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. దేశమంతటా విభిన్న పేర్లు, సంప్రదాయాలతో జరుపుకునే మకర సంక్రాంతి సంస్కృతిలోని ఏకత్వం, సమష్టి భావాన్ని ప్రతిబింబిస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.దేశమంతటా విభిన్న పేర్లు, సంప్రదాయాలతో జరుపుకునే మకర సంక్రాంతి భారతీయ సంస్కృతిలోని ఏకత్వం, సమష్టి భావాన్ని ప్రతిబింబిస్తుంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పర్వదినం నియమశీలత, ముందడుగు అనే సందేశాలను అందిస్తుంది. రైతుల పండుగగా నిలిచే మకర సంక్రాంతి.. ఋతువుల మార్పులు, అనిశ్చితులను తట్టుకుని దేశాన్ని పోషించే అన్నదాతలకు అంకితంగా నిలుస్తుంది. వారి కృషి, సహనం, త్యాగమే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది.. ప్రతి భారతీయుడి జీవనానికి ఆధారం. మకర సంక్రాంతి దేశంలో ఐక్యతను మరింత బలోపేతం చేసి సమృద్ధి, సమష్టి ప్రగతిని తీసుకురావాలని ఆకాంక్షిద్దాం. అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు' అని పవన్ కల్యాణ్పేర్కొన్నారు. ఇది మన సంస్కృతి: నారా లోకేశ్ ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. 'సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే పుణ్యకాలాన్ని తెలుగు లోగిళ్లలో మకర సంక్రాంతిగా జరపడం మన సంస్కృతి. అభివృద్ధి, సంక్షేమాలే పాడిపంటలై రాష్ట్రమంతా పెద్దపండుగ కళ సంతరించుకుంది. ప్రతి ఇంటా ఆనందాలు నిండుగా సంక్రాంతి పండుగ జఅరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని లోకేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు.

# ఎగిరిన కోడి.. తెగిన కట్టలు

**క్రైమ్ కౌంటర్ న్యూస్,** గుడివాడ): సంక్రాంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా కోడిపందేలు, పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగాయి. ముఖ్యంగా గుడివాడ పట్టణం బైపాస్ రోడ్డులోని గౌతమ్ స్కూల్ వెనుక, గుడివాడ మండలం టిడ్కో కాలనీ వద్ద, రామనపూడి క్వాలిటీ ఫీడ్స్ పక్కన భారీ స్థాయిలో కోడి పందాలు, పేకాట శిబిరాలను నిర్వహించారు. నందివాడ మండలంలోని నందివాడ, పుట్టగుంట, పోలుకొండ, తమిరిశ, గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు, కౌతవరం, కుచ్చికాయలపూడి, అంగలూరు, కూరాడ, డోకిపర్రులలో కోడిపందేలు, పేకాట విచ్చలవిడిగా నిర్వహించారు. ముఖ్యంగా లోనా, బయట విచ్చలవిడిగా సాగింది, గుండాట బహిరంగంగానే నిర్వహించారు.

రెండు చోట్ల బైక్లు, స్కూటీల బహూకరణ

గుడివాడ టిడ్కో కాలనీ, గుడ్లవల్లేరు వద్ద జరిగిన నిర్దిష్ట కోడిపందేల్లో గెలిచిన వారికి బైక్లను బహుమతులుగా అందజేశారు. టిడ్కో కాలనీ బరిలో రెండు బుల్లెట్లు, తొమ్మిది యూనికార్న్ లు, గుడ్లవల్లేరులో ఆరు స్కూటీలను నిర్వాహకులు ప్రకటించారు. దీనిలో తొలి రోజు పందేల్లో గుడ్లవల్లేరు బరిలో గెలిచిన వారికి మూడు స్కూటీలను అందజేశారు.

బుడమేరులో భారీ పేకాట శిబిరం

నందివాడ మండలం, ఇలపర్రు, ఏలూరు జిల్లా, పెదపాడు మండలం శివారుల్లో బుడమేరులో భారీ పేకాట శిబిరాన్ని నిర్వహించారు. లోనా బయట భారీస్థాయిలో జరిగింది.

పందెపురాయుళ్లతో ట్రాఫిక్ జామ్

హనుమాన్ జంక్షన్ రూరల్: కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దులో బిళ్లనపల్లి రోడ్డులోని మీర్జాపురం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో కోడిపందాలు వీక్షించేందుకు, జూదం ఆడేందుకు వచ్చే వారి కార్లతో మల్లవల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రహదారి ట్రాఫిక్ జామ్ అయింది. నిర్వాహకులు



ఏర్పాటు చేసిన పార్కింగ్ కూడా కార్లతో నిండిపోవడంతో ఎంఎన్‌కే రహదారికి ఇరువైపులా కార్లను నిలిపివేసి కోడిపందాలను చూసేందుకు కుటుంబాలతో సహా తరలివచ్చారు. వీక్షకులు, కుటుంబాలతో సహా వేలాదిగా తరలిరావడంతో బిళ్లనపల్లి ప్రధాన రహదారి కార్లతో, టైక్లతో నిండిపోయి గ్రామస్తులకు ఇబ్బందిగా తయారైంది. అటు మీర్జాపురం గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన బరి తిరునాళ్లను తలపిస్తోంది.

బంటుమిల్లి: భోగి రోజున కోడిపందేలు, పేకాట జోరుగా సాగాయి. 216 జాతీయ రహదారికి అడుగుదూరంలో పెందుర్రు, బంటుమిల్లి, మల్లేశ్వరం, ఆర్తమూరు గ్రామాలల్లో భారీఎత్తున పందేలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. పెందుర్రులో 13 పందేలకు గాను 9 పందేలు గెలిచిన కోన గ్రామానికి చెందిన గద్దె సతీశ్ కు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ షిఫ్ట్ కారును బహూకరించారు.

# జగన్ ఫొటో ఉన్న పాస్ పుస్తకాలు దహనం



విజయవాడ సిటీ, జనవరి 15: వైసీపీ హయాంలో జగన్ ఫొటోతో రైతులకు జారీ చేసిన పాస్ పుస్తకాలను తెలుగుదేశం పార్టీ నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. విజయవాడలోని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో బుధవారం భోగి వేడుకలు నిర్వహించారు. ఎంపీ చిన్ని, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, పార్టీ నాయకులు బొప్పన భవకుమార్, సీతారామయ్య, షేక్ ఆషా, చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ ఫొటో ఉన్న పాస్ పుస్తకాలను నాయకులు భోగి మంటల్లో వేశారు. ఎంపీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానాలను ఇప్పుడు ఆ పార్టీ నేతలే భోగి మంటల్లో కాల్చుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులపై జగన్ బొమ్మను ముద్రించడాన్ని తప్పుబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజముద్రతో పాస్ పుస్తకాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజా నిర్ణయాలకు వ్యతిరేకంగా జగన్ బొమ్మతో ముద్రించిన పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేసి కొత్త సంక్రాంతికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.

# సినిమా



## మహేష్ బాబు హెల్త్ విషయంలో తీసుకునే జాగ్రత్తలు ఇవే

మహేష్ బాబు సోదరి మంజుల ఘట్టమనేని నటిగా సుపరిచితమే. సినిమాలతోపాటు ఇటు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం తన ఆరోగ్య, ఫిట్‌నెస్ విధానాలను పంచుకుంటారు. మహేష్ బాబు కూడా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారని ఆమె తెలిపారు. 14–15 ఏళ్ల వయస్సు నుంచే పండ్లు, గింజలు కొని తెచ్చుకోవడం, ఆరోగ్య పుస్తకాలు చదవడం ప్రారంభించానని చెప్పారు. శ్రీ శ్రీ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నట్లు తెలిపారు. తన కుటుంబంలో మహేష్ బాబు కూడా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారని అన్నారు. చిన్నతనంలో తన తల్లి క్యారెట్ జ్యూస్ చేసి ఇవ్వడం ద్వారా వారిలో కూడా ఆరోగ్య స్పృహను పెంచారని పేర్కొన్నారు.

ఆర్గానిక్ ఆహారం తీసుకోవడం అందరికీ అవసరమని మంజుల చెప్పారు. రసాయన పురుగుమందులను ఆహారంలో, భూమిలో చేర్చడం వల్ల కలిగే తీవ్రమైన హానికరమైన ప్రభావాలను ఆమె వివరించారు. దీనిపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఆర్గానిక్ ఆహారం సాధారణ ఆహారం కంటే కొద్దిగా ఖరీదైనదని ఒప్పుకుంటూనే, డిజైనర్ బ్యాగులు లేదా బట్టలపై లక్షలు ఖర్చు చేసేవారు, ఆరోగ్యం కోసం కొద్దిగా ఎక్కువ ఖర్చు చేయడానికి వెనుకాడటం హాస్యాస్పదంగా ఉందని మంజుల ఘట్టమనేని అన్నారు. శరీరాన్ని దేవాలయంతో పోల్చి, దానిని సంరక్షించుకోవడం మన బాధ్యత అని, ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఖర్చు చేయడాన్ని రెండుసార్లు ఆలోచించాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు.ఉదయం సూర్యరశ్మి కళ్ళపై పడినప్పుడు, అది మెదడుకు రోజు ప్రారంభమైందని సంకేతం ఇస్తుందని, దీనివల్ల శరీరం సమతుల్యం అవుతుందని, శక్తివంతంగా మారుతుందని చెప్పారు. దీన్ని సర్కేడియన్ రిథమ్ లేదా బయోలాజికల్ క్లాక్ అని పిలుస్తారని ఆమె తెలిపారు. సూర్యాస్తమయం సమయంలో ఎరుపు రంగు కాంతిని చూడటం మనస్సును ప్రశాంతపరుస్తుందని అన్నారు. అలాగే మహేష్ సైతం ఫిట్‌నెస్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారని.. నిత్యం గంటపాటు కఠినమైన వ్యాయామాలు చేస్తారని అన్నారు. కూరగాయలు, పండ్లు మాత్రమే తింటారని అన్నారు.





## చలికాలంలో నల్ల జీలకర్ర తింటే ఏమవుతుందో తెలుసా..?

చలికాలం వచ్చిందంటే చాలు.. వేడివేడి బజ్జీలు, సమోసాలు వంటి వేయించిన ఆహార పదార్థాలు తినాలనిపిస్తుంది. అదే సమయంలో చలి వల్ల శారీరక శ్రమ తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పేరుకుపోయి బరువు పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలన్నింటికీ వంటగదిలో ఉండే నల్ల జీలకర్ర ఒక అద్భుతమైన పరిష్కారం అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.చలికాలంలో నల్ల జీలకర్ర ఎందుకు తినాలి?

బరువును అదుపులో ఉంచుతుంది

చలికాలంలో వ్యాయామం తగ్గడం వల్ల శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. నల్ల జీలకర్ర శరీరంలో కొత్త కొవ్వు కణాలు ఏర్పడకుండా నిరోధిస్తుంది. ఇది సహజంగా బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని నియంత్రించడానికి సహాయపడుతుంది.

గుండెకు రక్షణ కవచం

చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. నల్ల జీలకర్ర శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీనివల్ల రక్త ప్రసరణ సాఫీగా జరిగి గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

మెటబాలిజం పెరుగుతుంది

సాధారణంగా ఈ సీజన్‌లో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. నల్ల జీలకర్ర జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల తీసుకున్న ఆహారం త్వరగా జీర్ణమవడమే కాకుండా శరీరానికి కావాల్సిన శక్తి అందుతుంది.

కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం

చలికాలంలో చాలా మందిని వేధించే ప్రధాన సమస్య కీళ్ల నొప్పులు. నల్ల జీలకర్రలో ఉండే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలోని వాపులను తగ్గించి, కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి.

రోగనిరోధక శక్తి పెంపు

చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి ఇందులోని యాంటీఆక్సిడెంట్లు సహాయపడతాయి. ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

నల్ల జీలకర్రను ఎలా వాడాలి?

నల్ల జీలకర్రను దోరగా వేయించి పొడి చేసుకోవాలి.

ప్రతిరోజూ ఉదయం అర టీస్పూన్ పొడిని గోరువెచ్చని నీటిలో లేదా తేనెతో కలిపి తీసుకోవచ్చు.

మీరు తాగే టీలో కూడా చిటికెడు పొడిని కలుపుకోవచ్చు.



## చలికాలంలో జామకాయ తింటే ఏమవుతుంది.

చలికాలం వచ్చిందంటే చాలు మార్కెట్లో ఎక్కడ చూసినా జామకాయలు దర్శనమిస్తాయి. చాలామంది వీటిని కేవలం రుచి కోసం తింటారు. కానీ జామకాయ కేవలం పండు మాత్రమే కాదు.. అది ఒక సూపర్ ఫుడ్. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది ఆపిల్ కంటే మెరుగ్గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జామకాయను మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే లాభాలేంటో ఇప్పుడు చూద్దాం.

పోషకాల గని: జామలో ఏమున్నాయి?

జామకాయను పోషకాల శక్తి కేంద్రంగా పిలుస్తారు. ఇందులో మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, విటమిన్ ఏ, విటమిన్ కె, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, జింక్, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.

ఆరోగ్య ప్రయోజనాలు ఇవే

రోగనిరోధక శక్తి పెంపు

జామలో ఉండే విటమిన్-సి చలికాలంలో వచ్చే ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు నుండి శరీరాన్ని రక్షిస్తుంది. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

జీర్ణక్రియకు ప్రాణం మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడేవారికి జామకాయ ఒక వరప్రసాదం. ఇందులో ఉండే పీచు పదార్థం పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మరియు జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది.

బరువు తగ్గడానికి -మధుమేహానికి

బరువు తగ్గాలనుకునే వారు జామకాయను నిరభ్యంతరంగా తినవచ్చు. ఇది ఆకలిని నియంత్రిస్తూనే తక్కువ కేలరీలను అందిస్తుంది. అంతేకాకుండా ఇది రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది, కాబట్టి డయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా మంచిది.

గుండె ఆరోగ్యం జామలోని పొటాషియం, ఫైబర్ రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

## తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం..

అండర్-19 పురుషుల ప్రపంచ కప్‌ను భారత్ విజయంతో ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు అమెరికాను ఆరు వికెట్ల తేడాతో ఓడించింది. గురువారం బులవాయోలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుని, అమెరికాను 107 పరుగులకే ఆలౌట్ చేసింది. ఆ తర్వాత భారత్ కేవలం 17.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.

జట్టు కేవలం 39 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పేలవమైన ఆరంభాన్ని సాధించింది . అమ్రీందర్ గిల్ 1 పరుగులకు, సాహిల్ గార్గ్ 16 పరుగులకు, ఉత్కర్ష్ శ్రీవాస్తవ 0 పరుగులకు, అర్జున్ మహేష్ 16 పరుగులకు, అమోఘ్ అరెపల్లి 3 పరుగులకు ఔటయ్యారు. ఆ తర్వాత అద్నీత్ జాంబ్ 18 పరుగులు చేసి జట్టు స్కోరును 50 దాటించాడు.

చివరికి నితీష్ సుడిని 36 పరుగులు చేసి జట్టును 35.2 ఓవర్లలో 107 పరుగులకు చేర్చాడు. భారతదేశం తరపున హెనిల్ పటేల్ ఐదు వికెట్లు పడగొట్టాడు. వైభవ్ సూర్యవంశీ, దీపేష్ దేవేంద్రన్, ఆర్ఎస్ అంబ్రిస్, ఖిలాన్ పటేల్ తలా ఒక వికెట్ పడగొట్టాడు. ఒక బ్యాట్స్‌మన్ కూడా రనౌట్ అయ్యాడు.108 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. వైభవ్ సూర్యవంశీ కేవలం రెండు పరుగులకే ఔటయ్యాడు. అమెరికన్ పేసర్ రిత్విక్ అప్పిడి బౌలింగ్ లో బౌలింగ్ వేశాడు. వర్షం పడటం ప్రారంభమయ్యే సమయానికి భారత్ నాలుగు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు, జట్టుకు 96 పరుగుల సవరించిన లక్ష్యాన్ని ఇచ్చారు.

కెప్టెన్ ఆయుష్ మాత్రే 19 పరుగులకే ఔటయ్యాడు. అతని తర్వాత వేదాంత్ త్రివేది 2, విహాన్ మల్హోత్రా 18 పరుగులు చేసి ఔటయ్యారు. ఆ తర్వాత వికెట్ కీపర్ అభిజ్ఞాన్ కుందు కనిష్క్ చౌహాన్‌తో కలిసి 18వ ఓవర్‌లో జట్టుకు విజయాన్ని అందించాడు. కుందు 42, కనిష్క్ 10 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

అమెరికా తరపున రిత్విక్ అప్పిడి రెండు వికెట్లు పడగొట్టాడు. రిషబ్ సింపి, ఉత్కర్ష్ శ్రీవాస్తవ తలా ఒక వికెట్ తీసుకున్నారు. షబరీష్ ప్రసాద్, ఆదిత్ కప్పా వికెట్ తీసుకోలేదు. భారత్ తరపున ఐదు వికెట్లు తీసిన హెనిల్ పటేల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యాడు.

టాంజానియాను వెస్టిండీస్ ఓడించింది. గ్రూప్ డిలో, విండ్‌హోక్‌లో వెస్టిండీస్, టాంజానియా మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టాంజానియా 122 పరుగులకు ఆలౌట్ అయింది. దయాళన్ థక్రార్ 26 పరుగులు, దర్పన్ జోబన్‌పుత్ర 19 పరుగులు చేశారు. వెస్టిండీస్ తరపున విటెల్ లాస్ 3 వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌లో తనేజ్ ఫ్రాన్సిస్ 52 పరుగులు, వికెట్ కీపర్ జుల్ ఆండ్రూ 44 పరుగులు చేసి జట్టుకు 5 వికెట్ల విజయాన్ని అందించారు. జింబాబ్వే, స్కాట్లాండ్ మధ్య జరిగిన గ్రూప్ సి మ్యాచ్ డ్రాగా ముగిసింది.

వార్మప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ భారత్‌ను ఓడించింది. ఇండియా, ఖూూ కాకుండా, గ్రూప్ దీలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ కూడా ఉన్నాయి. ఆయుష్ మాత్రే నేతృత్వంలోని జట్టులో వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా వంటి వర్ధమాన ఆటగాళ్ళు ఉన్నారు. దక్షిణాఫ్రికాను 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన తర్వాత భారత జట్టు అండర్-19 ప్రపంచ కప్‌కు చేరుకుంది. అయితే, ఇంగ్లాండ్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొంది.

భారత్: ఆయుష్ మ్హాత్రే ( కెప్టెన్ ), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వాన్ష్ పంగాలియా, ఆర్ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్, దీపేష్ దేవేంద్రన్, ఖిలాన్ పటేల్.

అమెరికా: ఉత్కర్ష్ శ్రీవాస్తవ (కెప్టెన్), అమ్రీందర్ గిల్, సాహిల్ గార్గ్, అర్జున్ మహేష్ (వికెట్ కీపర్), రిత్విక్ అప్పిడి, అద్నీత్ జంబ్, అమోఘ్ ఆరేపల్లి, నితీష్ సుదిని, శబరీష్ ప్రసాద్, శివ్ షాని, అదిత్ కప్పా, రిషబ్ షింపి.

భారతదేశం ఐదు -19 ప్రపంచ కప్ టైటిళ్లను కలిగి ఉంది. అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలో భారతదేశం అత్యంత విజయవంతమైన జట్టు. ఈ జట్టు ఐదుసార్లు (2000, 2008, 2012, 2018, 2022) టైటిల్‌ను గెలుచుకుంది. అదే సమయంలో 2006, 2016, 2020, 2024లలో రన్నరప్‌గా నిలిచింది.

ప్రస్తుత ఛాంపియన్లు ఆస్ట్రేలియా, 2024 ఫైనల్‌లో భారత్‌ను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. ఆస్ట్రేలియా నాలుగుసార్లు టైటిల్‌ను గెలుచుకుంది. పాకిస్తాన్ రెండుసార్లు గెలిచింది. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ ఒక్కొక్కటి అండర్-19 ప్రపంచ కప్‌ను గెలుచుకున్నాయి.



## కెరీర్‌లో మర్చిపోలేని బ్యాడ్ డే

అండర్-19 ప్రపంచకప్ 2026 గ్రూప్-ఏలో భాగంగా భారత్ వర్సెస్ అమెరికా మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్‌పై వరుణుడు నీళ్లు చల్లాడు. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా జట్టును భారత బౌలర్లు 107 పరుగులకే కుప్పకూల్చారు. అయితే, సులభమైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. భారత్ విజయానికి చేరువలో ఉన్న సమయంలో భారీ వర్షం పడటంతో ఆట తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ లోపే టీమిండియా యంగ్ ప్లేయర్ వైభవ్ సూర్యవంశీ రూపంలో బిగ్ షాక్ తగిలింది.వైభవ్ సూర్యవంశీ వైఫల్యం -- కోహ్లీ రికార్డు మిస్..ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి టీమిండియా ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. అతి పిన్న వయసులో అండర్-19 వరల్డ్ కప్‌లో ఆడుతున్న వైభవ్, విరాట్ కోహ్లీ పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డును బద్దలు కొడతాడని అందరూ భావించారు. అయితే, అమెరికా బౌలర్ ఋత్విక్ అప్పిడి వేసిన అద్భుతమైన బంతికి వైభవ్ కేవలం 2 పరుగులకే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో కోహ్లీ నెలకొల్పిన చారిత్రాత్మక మార్కును చేరుకోవడంలో వైభవ్ విఫలమయ్యాడు.

భారత జట్టులో ఆందోళన..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ, వర్షం పడే సమయానికి భారత్ కీలక వికెట్లు కోల్పోయింది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దయితే, డక్‌వర్త్ లూయిస్ (డీఎల్) పద్ధతి ప్రకారం ఫలితం ఎలా ఉంటుందనే ఆందోళన అభిమానుల్లో నెలకొంది. ప్రస్తుతం గ్రూప్-ఏలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం భారత్‌కు చాలా కీలకం.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.